

ధర్నా చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

బర్కత్‌పుర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఫీవర్ ఆస్పత్రిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని ఆయన అన్నారు. 13 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు సాహితీ కన్సల్టెన్సీ, నక్షత్ర కన్సల్టెన్సీ సంస్థలు వేతనాలు ఇవ్వకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. వేతనాలు ఇవ్వకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉద్యోగుల సంఘం ఫీవర్ ఆస్పత్రి యూనిట్ అధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు జనార్దన్, సతీష్, పద్మజ, నాయకులు నవాజ్, యాస్మిన్, భాగ్య, మాయ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో అవినీతిపై విచారణ జరిపించాలి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

బర్కత్‌పుర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్ రాథోడ్ డిమాండ్ చేశారు. బుధవారం మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జేవీఎల్ శిరీష హయాంలో అవినీతి అక్రమాలు జరిగాయని, దీనిపై విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో హెల్త్ డైరెక్టర్‌గా విధులుగా నిర్వహించిన గడాల శ్రీనివాస్ సహకారంతో అక్రమాలు జరిగాయని, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన అధికారులను వేధించారని ఆరోపించారు. మంత్రికి నియామకపత్రం అందజేసిన వారిలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు కేశవ్‌నాయక్, నందు నాయక్, సురేష్‌నాయక్, రాందాస్ నాయక్, అశోక్‌నాయక్, ప్రేమ్‌నాయక్ తదితరులు ఉన్నారు.



వాల్ రైటింగ్‌ను ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

400 ఎంపీ స్థానాల్లో బీజేపీ గెలుపు ఖాయం

రాంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 400 ఎంపీ స్థానాలు గెలవడం ఖాయమని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు పేర్కొన్నారు. బుధవారం అడిక్‌మెట్ డివిజన్‌లో టీఆర్‌టీ కాలనీ, మేడిబావి బస్తీ, రాంనగర్ గుండు ప్రాంతాలలో డివిజన్ అధ్యక్షుడు ఆర్.నరేష్ ఆధ్వర్యంలో ఔర్ ఏక్‌బార్ మోదీ సర్కార్ వాల్ రైటింగ్ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా పూస రాజు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి పాల్గొని ప్రారంభించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గౌరీశంకర్, నాయకులు ఓంప్రకాష్, శ్రీకాంత్‌గౌడ్, కౌండిన్యప్రసాద్, ఎస్. బాల్‌రాజ్, సంతోష్ పాల్గొన్నారు.

బీసీ కులగణన తర్వాతే..

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

కవాడిగూడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ కులగణన చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం అభినందనీయమని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ అన్నారు. బీసీ కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. బుధవారం సచివాలయంలో పంచాయతీ రాజ్ శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను కలిసి వినతిపత్రం అందజేశామని ఆయన చెప్పారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 44 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగయ్య, బీసీ విద్యార్థి సంఘం, వివిధ జిల్లాల అధ్యక్షులు ఇందిరం రజక, నారోజు రాకేష్‌చారి, తిరుపతి, సంజు పాల్గొన్నారు.

16న గ్రామీణ భారత్ బంద్

రాంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల జాతీయ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న గ్రామీణ భారత్ బంద్ నిర్వహిస్తున్నామని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంకే బోస్, ప్రధాన కార్యదర్శి ఎం. ప్రసాద్ తెలిపారు. టీడీపీ కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కిని నర్సింహులు బుధవారం ఆవిష్కరించారు. టీడీపీ, టీఎన్‌టీయూసీ నాయకులు రత్నాకర్‌రావు, ఏబీఆర్ మోహన్‌రావు, జగదీష్, రాంబాబు, పుణ్యకోటి శాస్త్రి, బీఆర్ సుబ్రహ్మణ్యరావు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న కేపీ మురళీకృష్ణ తదితరులు

నల్లకుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నాడు ఆట, పాటలతో తెలుగు చిత్రసీమతోపాటు తెలంగాణ ఉద్యమంలో ప్రజా చైతన్యం కల్పించిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని బీసీ జాగృతి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కె.పీ.మురళీకృష్ణ శ్లాఘించారు. గద్దర్ 76వ జయంతి సందర్భంగా బుధవారం నల్లకుంటలో బీసీ జాగృతి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మురళీకృష్ణ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం గద్దర్ తన పాటల రూపంలో చైతన్యవంతులను చేయడంలో కీలకపాత్ర వహించారని కొనియాడారు. నాయకులు ఈశ్వర్, జి.కృష్ణ, ఆర్.నర్సింగ్‌రావు, రామకృష్ణ, పాతకోటి మహేష్, ఎం.బి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ అగ్రి షోలో 'పెర్‌ఫెక్ట్' ఉత్పత్తులు

- నేటి నుంచి ప్రదర్శన



'పెర్‌ఫెక్ట్' బాటిల్

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ప్రధాన కేంద్రంగా సేవలందిస్తున్న క్రాఫ్ట్ ఫౌండేషన్, గ్లోబల్ గ్రీన్ అగ్రినోవా నిర్వహణలోని 'పెర్‌ఫెక్ట్' బ్రాండ్ ఉత్పత్తులను హైదరాబాద్‌లోని హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు జరిగే కిసాన్ అగ్రి షోలో ప్రదర్శించనున్నారు. ఈ మేరకు సంస్థ బెంగళూరులో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. వృక్ష ఆయుర్వేదంతో 11 వనమూలికల ఔషధ సమ్మేళనంగా ఉన్న 'పెర్‌ఫెక్ట్' మందు సమగ్ర సస్యరక్షణకు దోహదపడుతుందన్నారు. పంట పొలాలు, తోటల్లో అధిక దిగుబడి సాధించేలా రసాయనిక అవశేషాలు లేని విధంగా విస్తృత పరిశోధనల అనంతరం 'పెర్‌ఫెక్ట్'ను తయారు చేసినట్టు సంస్థ పేర్కొంది. వైరస్ బారి నుంచి పంటలను, తోటలను కాపాడే గొప్ప గుణాలు ఇందులో ఉన్నాయని గ్లోబల్ గ్రీన్ అధినేత బీఎస్.మూర్తి పేర్కొన్నారు. హైదరాబాద్ కిసాన్ అగ్రి ప్రదర్శనలోని బీ-120 పెర్‌ఫెక్ట్ స్టాల్‌ను రైతులు, తోటల పెంపకందారులు సందర్శించి ప్రయోజనం పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నాలుగేళ్లయినా పూర్తికాని పనులు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశించినా స్పందించని జీహెచ్‌ఎంసీ అధికారులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా ఇందిరానగర్ కమ్యూనిటీహాల్ ఆవరణ

ముషీరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): శంకుస్థాపన చేసి నాలుగేళ్లయినా కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తి కాలేదు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్ ఫస్ట్ వెంచర్‌లో 2020 ఫిబ్రవరి 15న రూ.19 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, దివంగత మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే ముఠాగోపాల్ శంకుస్థాపన చేశారు. పనులు కేవలం స్లాబ్, గోడలకే పరిమితమయ్యాయి. జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 10 రోజుల క్రితం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌కు శాంతి భారత్ సేవా సమాజ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కమ్యూనిటీ హాల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కిషన్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.

కమ్యూనిటీ హాల్ ఆవరణలో కొంతమంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడిందంటే కమ్యూనిటీ హాల్ వద్ద కూర్చొని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు

పనులు పూర్తి చేయాలి



కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులకు విన్నవించినా స్పందించడం లేదు. ఫ్లోరింగ్, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, కమ్యూనిటీ హాల్ చుట్టూ ప్రహరీ నిర్మించాలి.

- నందగిరి నర్సింహ, శాంతి భారత్ సేవా సమాజ్ ప్రధాన కార్యదర్శి

పనుల పూర్తికి చర్యలు తీసుకుంటాం



కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయిస్తాం. త్వరగా పనులు పూర్తి చేసి కమ్యూనిటీ హాల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

- ముఠా గోపాల్, ముషీరాబాద్ ఎమ్మెల్యే

కేసీఆర్ కుట్రలను నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం



ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీజేఎస్ నేతలు

చిక్కడపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమ సారథి ప్రొఫెసర్ కోదండరాం శాసనమండలి ఎన్నికను కేసీఆర్ అడ్డుకుంటున్నారని ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు నిరసనకు దిగారు. బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో టీజేఎస్ ముషీరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. టీజేఎస్ గ్రేటర్ అధ్యక్షుడు ఎం. నరసయ్య మాట్లాడుతూ.. కోదండరాంపై కేసీఆర్ కుట్రలు కొత్తేమీ కాదని, తొమ్మిదేళ్లుగా అనేక రకాల దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కోదండరాం పోటీచేస్తే కోట్లు ఖర్చుపెట్టి ఓడించారని పేర్కొన్నారు. కోదండరాం ఇంటి తలుపులు బద్దలు కొట్టడమే కాకుండా అనేక కేసులు పెట్టి చట్టసభకు ఎన్నిక కాకుండా కేసీఆర్ అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ కుట్రలను రాష్ట్ర ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, ఉద్యమకారులు వ్యతిరేకించాలని కోరారు. పార్టీ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్, బి. రామచందర్, జశ్వంత్‌కుమార్, మధు, జైపాల్‌రెడ్డి, సుధాకర్, గుండెల్లి రవీందర్‌యాదవ్ పాల్గొన్నారు.

అడ్డుకోవడం తగదు

తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాలను ఒకేతాటిపైకి తీసుకొచ్చిన కోదండరాంను ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయకుండా బీఆర్‌ఎస్ అడ్డుకోవడం తగదని నిరుద్యోగులు హెచ్చరించారు. చిక్కడపల్లి లైబ్రరీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. సలీమ్, వెంకట్‌రెడ్డి, సురేష్, మహేష్, పరశురామ్, మధు పాల్గొన్నారు.

ముషీరాబాద్, అంబర్‌పేటలో

రూ. 54 లక్షలతో డ్రైనేజీ పైపులైన్, సీసీ రోడ్లు

రాంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోకవర్గాల్లో రూ. 54 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేష్ బుధవారం ప్రారంభించారు. రాంనగర్ డివిజన్ హోటల్ కెప్టెన్ కుక్ నుంచి వెస్లీ చర్చి వరకు రూ. 6 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులు, మేదరబస్తీలో మసీదు వీధి నుంచి ఎస్ఆర్‌టీ క్వార్టర్స్ వరకు రూ. 8 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రవిచారి బుధవారం ప్రారంభించారు. అనంతరం పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జలమండలి అధికారులకు సూచించారు. బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, టి.శంకర్‌ముదిరాజ్, ఎం.దామోదర్‌రెడ్డి, కేశపురం అరుణ్, ఎర్రంశేఖర్, కొండమడుగు మధు, జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, మేనేజర్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాగ్‌అంబర్‌పేటలో..

బాగ్‌అంబర్‌పేట డివిజన్ శ్రీనివాసనగర్ కాలనీ, వినాయక్‌నగర్ కాలనీలో రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించే సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని బస్తీలు, కాలనీల్లో దశలవారీగా సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

మాజీ కార్పొరేటర్లు బి. వెంకట్‌రెడ్డి, కె. పద్మావతి డీపీరెడ్డి, జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్ పాల్గొన్నారు.





డ్రైనేజీ పైపులైన్, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్

దేశవ్యాప్తంగా వంద ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తాం

- రాష్ట్రంలో ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన దళిత బహుజన పార్టీ

బర్కత్‌పుర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మోదీ సర్కార్ హఠావో, దేశ్‌కి బచావో అన్న నినాదంతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు దళిత బహుజనపార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా వంద ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తామన్నారు. రాష్ట్రంలో ఆరు ఎంపీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విడుదల చేశారు. రాష్ట్రంతోపాటు ఏపీ, ఉత్తర్‌ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, డిల్లీ, ఓడిశా రాష్ట్రాలలో పోటీ చేస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి షేక్‌బాషా, సికింద్రాబాద్ నుంచి జయన్‌రావు, భువనగిరి నుంచి పి. సందీప్‌రావు, మహబూబాబాద్ నుంచి ఎం రవీంద్రనాయక్, చేవెళ్ల నుంచి డాక్టర్ వీఎల్ రాజు, మల్కాజిగిరి నుంచి వడ్డే శ్రీనివాస్‌రావు పోటీచేస్తున్నట్లు చెప్పారు. రెండో జాబితాను ఫిబ్రవరి 11న విడుదల చేస్తామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పోటీ చేసే వారణాసి నియోజకవర్గం నుంచి కూడా తమ పార్టీ అభ్యర్థిని బరిలోకి దింపుతామన్నారు. సికింద్రాబాద్ ఎంపీ నియోజకవర్గంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోనియా, రాహుల్, ప్రియాంక, మల్లికార్జున్ ఖర్గే పోటీచేసే నియోజవర్గాల్లో కూడా అభ్యర్థులను నిలబెడతామన్నారు. ఏపీలో అసెంబ్లీ ఎన్నికల్లో కూడా తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. దళిత బహుజన పార్టీని ఆదరించాలని ప్రజలను ఆయన కోరారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బీరమ్ సతీష్, నాయకులు గణేష్, సుబ్బారావు, సీహెచ్ కరుణాకర్, సుఖేంద్రరావు, అజయ్, వినోద్, రవీందర్, నాగేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శుల నియామకం



నియామక పత్రాలు అందుకున్న వారితో ఎం. అనిల్‌కుమార్ యాదవ్

కవాడిగూడ/ముషీరాబాద్/రాంనగర్/చిక్కడపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షులుగా పొత్తూరి లక్ష్మణ్, జి. సాయిబాబా, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా మద్దెల ప్రభాకర్, పబ్బతి అరుణ్‌గౌడ్, ఎండీ. హఫీజ్, నీలం చందర్, ఎండీ రిజ్వాన్(సోహెల్), జెరిపోతుల కృష్ణ, కార్యదర్శిగా మీసాల జయకుమార్, సెక్రటరీ జనరల్‌గా బంటారం యాదగిరిగౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సూర్యచంద్రశేఖర్, రాములు నియమితులయ్యారు. వీరికి యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు ఎం. అనిల్‌కుమార్‌యాదవ్ నియామకపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు పోతరాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పండ్లు పంపిణీ

రాంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ప్రముఖ డాక్టర్ మల్లికార్జున్ ప్రసాద్ సూచించారు. చిక్కడపల్లిలో బుధవారం కందూరి కృష్ణ ఫౌండేషన్, సేథ్ మాణిక్‌లాల్ అగర్వాల్ ఫౌండేషన్‌ల సంయుక్తాధ్వర్యంలో పేదలకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థల చైర్మన్లు కందూరి కృష్ణ, మాణిక్‌లాల్ అగర్వాల్, ప్రతినిధులు డాక్టర్ సంగీత, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పునరావాసం కల్పించాలంటూ నిరసన



ఇళ్లు కూల్చివేసిన చోటే భోజనాలు చేస్తున్న బాధితులు

చిక్కడపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందనగర్‌లో ఇళ్లు కూల్చివేసి మూడు రోజులు గడుస్తున్నా బాధితులకు పునరావాసం కల్పించకపోవడంతో నిరసన కొనసాగిస్తున్నారు. అక్కడే వంట చేసుకొని ఉంటున్నారు. మాజీ ఎమ్మెల్యే ఎం. కోదండరెడ్డి బాధితులను బుధవారం పరామర్శించారు. పునరావాసం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు పి.శంకర్ కోరారు. సికింద్రాబాద్ ఆర్డీవో రవి, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితులకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బుధవారం లేఖ రాశారు. వారిని ఆదుకోవాలని కోరారు.

సోమేశ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలి : టీడీపీ

రాంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అధికార దుర్వినియోగానికి పాల్పడిన మాజీ చీఫ్ సెక్రటరీ సోమేశ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమేశ్‌కుమార్ చీఫ్ సెక్రటరీగా ఉన్నప్పుడు అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌ను రూపొందించి పేదలకు అన్యాయం చేశారన్నారు. రేరా చైర్మన్‌గా కొనసాగిన కాలంలో రంగారెడ్డి జిల్లా, యాచారం మండలం, కొత్తపల్లిలో కుటుంబసభ్యుల పేరిట ఆస్తులు కొనుగోలు చేశారని ఆరోపించారు. విచారణ జరిపి ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో స్టేషన్ వద్ద అగ్నిప్రమాదం



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎగసిపడుతున్న మంటలు

ముషీరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ మెట్రో స్టేషన్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోవడంతో మంటలు చెలరేగాయని స్థానికులు అంటున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

బర్కత్‌పుర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. యాకత్‌పురా-డబీర్‌పురా రైల్వే స్టేషన్ల మధ్య 32 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలియరాలేదు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బర్కత్‌పుర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనంతో మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఇరువురూ గాయపడ్డారు. కాచిగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నింబోలిఅడ్డ ఫాతిమానగర్‌కు చెందిన మహ్మద్ ఉస్మాన్(21) ప్రైవేట్ ఉద్యోగి. మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై ఆర్రాస్‌పెంట వైపు వెళ్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వేగంగా వస్తూ ఉస్మాన్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. ఉస్మాన్‌ను పోలీసులు సైదాబాద్‌లోని సాయినర్సింగ్ హోమ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



మనోజ్‌కుమార్

చిక్కడపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమయ్యాడు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యానగర్‌కు చెందిన వనిత, మనోజ్‌కుమార్(46) భార్యాభర్తలు. మనోజ్‌కుమార్‌కు మతిస్థిమితం సరిగా లేదు. రెండు నెలల క్రితం కనిపించకుండా పోయాడు. పోలీసులు గాలించి ఆచూకీ కనుగొని అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. జనవరి 21న కనిపించకుండాపోయాడు. భార్య వనిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కన్నులపండువగా హనుమాన్‌చాలీసా పూజలు

చిక్కడపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం అష్టోత్తర శత హనుమాన్ చాలీసా పూజలు కన్నులపండువగా జరిగాయి. సుందరకాండ కార్యసిద్ధి హోమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సీతారామాంజనేయ స్వామి విగ్రహాలు, ఉత్సవ మూర్తులను రకరకాల పూలతో అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు.



జ్ఞానాంబ, విజయలక్ష్మిని సన్మానిస్తున్న జస్టిస్ నాగమారుతీశర్మ, కళా జనార్దనమూర్తి

త్యాగరాజస్వామి కీర్తనలు ప్రతి గుడిలో వినిపించాలి

- జస్టిస్ నాగమారుతీశర్మ

చిక్కడపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): త్యాగరాజస్వామి కీర్తనలు ప్రతి గుడిలో వినిపించాలని సీబీఐ కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీశర్మ అన్నారు. త్యాగరాజస్వామి కీర్తనలు ఆధ్యాత్మికతకు ప్రతీకలని అన్నారు. సమ్మోహన స్కూల్ ఫర్ మ్యూజిక్ ఆధ్వర్యంలో బుధవారం త్యాగరాయగానసభలో త్యాగరాజస్వామి 177వ ఆరాధన వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నాగమారుతీశర్మ పాల్గొన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించారు. సంగీత గురువు రమాప్రభ, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రముఖ సంగీత గురువులు జ్ఞానాంబ, విజయలక్ష్మి శిష్యబృందం త్యాగరాజస్వామి రచించిన కీర్తనలను ఆలపించింది.

త్యాగరాజస్వామి కీర్తనలు అజరామరం

- ప్రముఖ టీవీ దర్శక, నిర్మాత శోభాశంకర్

నల్లకుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): త్యాగరాజస్వామి కీర్తనలు అజరామరం అని ప్రముఖ టీవీ దర్శక, నిర్మాత శోభాశంకర్ అన్నారు. బాగ్‌అంబర్‌పేట షిరిడీ సాయిబాబా ఆలయ ధ్యానమందిరంలో త్యాగరాజస్వామి 177వ ఆరాధనోత్సవం, సరస్వతి సంగీత విద్యాలయం 68వ వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. త్యాగరాజస్వామి కీర్తనలను వర్ధమాన గాయనీ, గాయకులు మృదుమధురంగా ఆలపించారని ప్రశంసించారు. సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ పోఫూరి శ్రీనివాసశర్మ శిష్యబృందం ఆలపించిన పంచరత్న కీర్తనలు సంగీతప్రియులను ఆకట్టుకున్నాయి. ప్రముఖ వీణా విద్వాంసురాలు మల్లాది శాంతమూర్తి గానవాద్య కచేరీ ఆహుతులను ఆకట్టుకుంది. నర్తకి వాసుకీదేవి నృత్యప్రదర్శన ప్రేక్షకులను ముగ్ధులను చేసింది. అనంతరం సంగీత విద్యాలయం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

'తండాల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

రాంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గిరిజన తండా పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని, తండాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సేవాలాల్ సేన త్రిసభ్య రాష్ట్ర చైర్మన్ ప్రేమ్‌చంద్ నాయక్ డిమాండ్ చేశారు. సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఫిబ్రవరి 15న ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గిరిజన చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. జీవో నెంబర్ 3ను పునరుద్ధరించి గిరిజన ప్రాంతాల్లో విద్య, ఉద్యోగ రంగాల్లో నూటికి నూరు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలన్నారు. సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు రాంబాబునాయక్ మాట్లాడారు.